# సాక్షి
# విజయనగరం

ఆదివారం । 16 । మార్చి । 2025




### కుంకుమ పూజ



రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామంలోని లక్ష్మీగణపతి, విజయదుర్గ, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంబోలు రుద్రకోటేశ్వరశర్మ, రాంప్రసాద్‌శర్మ, ఆరవెల్లి ప్రసాద్‌శర్మ, రవిశాస్త్రి శర్మల సమక్షంలో సాగిన కుంకుమ పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. – రేగిడి



| ఇఫ్తార్ | సహార్ |
|---|---|
| ఆది (సా) | సోమ(ఉ) |
| 6.12 | 4.41 |

రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### బొండపల్లిలో ఒకేషనల్ జవాబు పత్రాల మూల్యాంకనం

సీతంపేట: ఉత్తరాంధ్రంలోని ఇంటర్మీడియట్ వృత్తివిద్యా కోర్సు విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం బొండపల్లిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17 నుంచి మూల్యాంకనం జరగనుంది. గతంలో విశాఖపట్నం జైలు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించేవారు. జనరల్ సబ్జెక్టుల మూల్యాంకనం యథావిధిగా పార్వతీపురం మన్యం జిల్లాలోని బెలగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు.

### నేడు ఎఫ్‌ఆర్‌ఓ ఉద్యోగాలకు రాతపరీక్ష

విజయనగరం అర్బన్: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించే రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే, ఈ నెల 17న జరగనున్న ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో పరీక్ష ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు. జిల్లాలోని చింతలవలస వద్ద ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగలోని అయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

### ఏప్రిల్ 14న మెరిట్ జాబితా విడుదల

విజయనగరం ఫోర్ట్: వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో 91 పోస్టులకు సంబంధించిన తుది మెరిట్ జాబితాను ఏప్రిల్ 14న ప్రకటిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ప్రకటించిన ప్రొవిజనల్ జాబితాలో అభ్యంతరాలుంటే వారం రోజుల్లో తెలియజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏప్రిల్ 20వ తేదీన కౌన్సెలింగ్ చేసి నియామకపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

### ఆటో డ్రైవర్ వీరంగం... లాఠీలకు పనిచెప్పిన ఖాకీలు!



లాఠీదెబ్బలతో చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రాంబాబు

మెరకముడిదాం: ఓ ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వీరంగం సృష్టించగా... పోలీసులు తమ లాఠీలకు పనిచెప్పిన ఘటన విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం బుదరాయవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బుధరాయవలస గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సిరిపురపు రాంబాబు కొన్నినెలల కిందట అదే గ్రామానికి చెందిన ఓ మహిళను తీసుకెళ్లిపోయాడు. అప్పటికే రాంబాబుకు భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో సైతం మద్యం సేవించి గొడవపడడంతో ఆమె కొద్దిరోజుల కిందట బుదరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ కోసం పోలీసులు రాంబాబును పిలిచారు. స్టేషన్‌లో విచారణ జరుపుతున్న సమయంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై తిరగబడడం, ఆటోను పోలీసులపైకి ఎక్కించే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు రాంబాబుని చుట్టుముట్టి లాఠీలకు పనిచెప్పారు. ఈ దాడిలో రాంబాబు వీపుపై తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఆటో డ్రైవర్‌ను కుటుంబ సభ్యులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. తనను విచారణకు పిలిచి నలుగురు పోలీసులు నిర్దాక్షిణ్యంగా కొట్టినట్టు ఆటోడ్రైవర్ పేర్కొన్నాడు. విచారణ సమయంలో సిబ్బందిపై తిరగబడడంతోనే కొట్టాల్సి వచ్చిందని ఎస్‌ఐ జె.లోకేశ్వర రావు తెలిపారు.

### వారి భూముల్లో ఇందిరమ్మ కాలనీ....

మల్లంపేట గ్రామస్తులకు గొల్లపల్లి రెవెన్యూ సర్వే నంబర్లు 633–1, 634, 635ల్లో భూములను ప్రభుత్వం ఇచ్చింది. అప్పుడు వారు క్లైమ్ చేసుకోలేదు. ఆ భూమి సాగులో లేదు. ఖాళీగా ఉన్న ఆ భూముల్లో 2006లో ఇందిరమ్మ కాలనీ వచ్చింది. ఎమ్మెల్యే బేబీ నాయన లేఅవుట్ వేస్తున్నది సర్వే నంబర్లు 619, 620, 621ల్లోని భూమి. అది రాజులకు చెందినది. రైతుల పట్టా భూములకు దానికి సంబంధం లేదు.
– ఎం.శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి



బొబ్బిలిలో వివాదాస్పదమైన భూములు

# ఇదేమి భూమాయ నాయనా!

బొబ్బిలి శివారులో అంతర్‌రాష్ట్ర రహదారికి అనుకొని ఉన్నవి ల్యాండ్ సీలింగ్ భూములు. చట్ట పరిమితికి మించి ఉండటంతో ప్రభుత్వానికి ఒకప్పుడు బొబ్బిలి రాజులే స్వాధీనం చేశారు. ఆ తర్వాత ఆ భూములను ప్రభుత్వం పేదలకు తలో ఎకరం చొప్పున కేటాయించింది. వారికి డీపట్టా ఇచ్చింది. పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. బ్యాంకులు కూడా వాటి ఆధారంగా రుణాలు ఇచ్చాయి. నిన్నామొన్నటి వరకూ ఆయా రైతులకు రైతుభరోసా పథకంలో పంట పెట్టుబడి సాయం సైతం అందింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతా తారుమారు అయ్యింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో టీడీపీ అభ్యర్థిగా బొబ్బిలిలో గెలిచిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తన అధికార బలంతో తమ భూములను లాక్కొన్నారని, ఇందుకు రికార్డులు మార్చేసి వీఆర్వో నుంచి రెవెన్యూ ఉన్నతాధికారుల వరకూ అంతా తమ వంతు సహకారం అందించారని బాధిత రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. – సాక్షి ప్రతినిధి, విజయనగరం/బొబ్బిలి

మల్లంపేట భూహక్కుదారులు...

| పేరు | పాస్‌బుక్ ఖాతా /పట్టా నంబరు | సర్వే నంబరు |
|---|---|---|
| తాడివలస వేణుగోపాలరావు | 365 | 635 |
| కళింగపట్నంరాముడమ్మ | 374 | 635 |
| బెవర సావిత్రమ్మ | 350 | 631/2 |
| అల్లు సీతమ్మ | 349 | 631/2 |
| మర్రాపు లక్ష్మి | 362 | 635 |
| తెంటు చిన్నమ్మి | 363 | 635 |
| మరడ పార్వతి | 364 | 635 |

- బొబ్బిలి శివారులో పేద రైతుల డీపట్టా భూముల కబ్జా?
- అధికార బలంతో ఎమ్మెల్యే బేబీ నాయన లాక్కొన్నారని బాధితుల ఆవేదన
- రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి అన్యాయం
- రెవెన్యూ అధికారుల సహకారంతోనే రికార్డులు మార్చేశారని ఆరోపణలు
- ఆ భూములు రాజులవే అంటూ 'రెవెన్యూ' వంతపాట
- తమ భూమికి, తమకు రక్షణ కావాలని బాధితుల ఆవేదన
- సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- లోకాయుక్తను ఆశ్రయించిన బాధిత రైతులు



వివాదాస్పద భూముల్లో చదును చేయిస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులు

#### పట్టాలున్నా భూమి హుష్‌కాకి...

గరిష్ఠ భూపరిమితి చట్టానికి లోబడి 1978–79లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు బొబ్బిలి పరిసరాల్లో వందలాది ఎకరాలు ఉన్నాయి. అందులో గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 628 నుంచి 635 వరకూ ఉన్న భూముల్లో పలువురు పేదలకు తలో ఎకరా చొప్పున ప్రభుత్వం 1991 సంవత్సరంలో డీ పట్టాలు ఇచ్చింది. అలా మల్లంపేట గ్రామానికి చెందిన ఏడుగురికి భూమి దక్కింది. అప్పటి నుంచి ఆయా హక్కుదారులు, వారి తదనంతరం వారి వారసులు సాగు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన రైతుభరోసా పథకంలో పంట పెట్టుబడి సాయం కూడా పొందారు. కొంతమంది బ్యాంకు నుంచి పంటరుణాలు కూడా తీసుకున్నారు. ఇప్పుడు అవేవీ వారి భూమిని, దానిపై వారి హక్కును నిలపడానికి అక్కరకురావట్లేదు.

#### అధికారుల పాత్ర ఎంత...

మల్లంపేట భూహక్కుదారులకు చెందిన భూమి విజయనగరం–పార్వతీపురం అంతర్‌రాష్ట్ర రహదారికి ఆనుకొని బొబ్బిలి పట్టణానికి సమీపంలో ఉంది. ఇప్పుడు అక్కడ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.2 కోట్ల వరకూ పలుకుతోంది. బేబీ నాయన బొబ్బిలి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎక్కువగా సీలింగ్ భూములపై కన్నువేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార బలం, మందీమార్బలంతో వాటిని స్వాధీనం చేసుకోవడం, వెంటనే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పరాధీనం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ పట్టా భూములను ప్లాట్లుగా చేసి అమ్మేస్తున్నా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదు. తమ భూములను లాక్కొన్నారంటూ మల్లంపేటకు చెందిన బాధిత భూహక్కుదారులు కొద్దిరోజులుగా గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో వారి వేదన అరణ్యరోదనే అయ్యింది. బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో, బొబ్బిలి మండల రెవెన్యూ కార్యాలయంలో, జిల్లా కలెక్టరేట్‌లో, చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదని వారు ఆవేదన చెందుతున్నారు. దీంతో లోకాయుక్తాను ఆశ్రయించారు. వారి ఫిర్యాదుపై విచారణకు స్వీకరించిన లోకాయుక్త... బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనకు, రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీచేసినట్లు తెలిసింది.

#### మా భూమి మాది కాదంటున్నారు....



మాకు ప్రభుత్వం డీ పట్టా ఇచ్చిన ఎకరా భూమిని ఎమ్మెల్యే బేబీనాయన బలవంతంగా ఆక్రమించుకున్నారు. మేము అడ్డుపడి అడిగితే ఈ భూమి మీది కాదు మాది అంటున్నారు. సంవత్సరాల తరబడి మేం అనుభవిస్తున్న భూమిని ఇప్పుడు కాదంటే మేము ఎవ్వరికి చెప్పుకోవాలి. భూమి సర్వే నంబర్లు మార్చేయడంలో వీఆర్వో సింహాచలం పాత్ర ఉంది.
– అల్లు సంతోష్‌కుమార్ (సీతమ్మ వారసుడు)

#### మాకు రైతు భరోసా కూడా వచ్చేది...



మాకు ప్రభుత్వం ఇచ్చిన భూమి సాగు చేసుకుంటున్నాం కాబట్టే రైతుభరోసా పెట్టుబడి సాయం కూడా గత ప్రభుత్వంలో అందేది. ఆధారాలు చూపించమంటే వీఆర్వో సింహాచలానికి ఇదే విషయం చెప్పాం. పట్టా చూపించాం. అయినాసరే మా భూమి ఆక్రమించుకున్నవారికి ఆయన వంత పాడుతున్నారు.
– తెంటు వరలక్ష్మి (చిన్నమ్మి వారసురాలు)

#### మా భూమిలో బేబీ నాయన లే అవుట్



డీపట్టా భూమిని 1991 నుంచి మా స్వాధీనంలోనే ఉంది. వర్షాలు లేక కొన్నాళ్లు సాగుచేయలేదు. ఈ భూమిపై ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారాలు, అలాగే రైతుభరోసా పెట్టుబడి సాయం వస్తున్నాయి. కానీ ఎమ్మెల్యే బేబీ నాయన అనుచరులు మా భూమిని లాక్కొన్నారు. అడిగితే వేరేచోట భూమి ఇస్తామన్నారు. అదేమీ ఇవ్వకుండానే మా భూమిలో లేఅవుట్ వేస్తున్నారు. – బెవర అప్పలనాయుడు (సావిత్రమ్మ వారసుడు)

#### చివరకు లోకాయుక్తకు వెళ్లాం



మా భూమిని ఎమ్మెల్యే బేబీ నాయన లాక్కొన్నారు. ఆయనకు వీఆర్వో సింహాచలం సహకరిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు, తహసీల్దారు కార్యాలయానికి వెళ్లాం. కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేశాం. సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశాం. మాకు న్యాయం జరగలేదు. చివరకు లోకాయుక్తకు వెళ్లాం.
– మత్స సుశీల (మరడ పార్వతీ వారసురాలు)

#### బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్నాం



మాకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో పంటలు సాగుచేసుకుంటూ అవసరాన్ని బట్టి బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్నాం. ఈ భూమి మాదిగాకపోతే అవన్నీ వస్తాయా?
– మరిపి సింహాచలమమ్మ (మర్రాపు లక్ష్మి వారసురాలు)

#### లోకాయుక్తకు నివేదిక ఇచ్చాం

మల్లంపేట గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త వివరణ కోరారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తహసీల్దారు ఇచ్చిన వివరాలను అనుసరించి లోకాయుక్త ప్రశ్నలకు సమాధానమిస్తూ వివరణ ఇచ్చాం. – జేవీవీఎస్ రామమోహనరావు, ఆర్డీవో, బొబ్బిలి

## రాజాంలో మెరిసిన మీనాక్షి చౌదరి



- సీఎంఆర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

రాజాం: ప్రముఖ సినీ నటి, సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ మీనాక్షి చౌదరి రాజాంలో శనివారం సందడి చేశారు. సీఎంఆర్ 18వ జ్యువెలరీ షోరూంను జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. షోరూంలో వెండి, బంగారు నగలను పరిశీలించారు. వాటిని అలంకరించుకుని మురిసిపోయారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎంఆర్ యాజమాన్యంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన జ్యువెలరీతో పాటు నూతన వస్త్రాలను సరసమైన ధరలకే అందిస్తూ సీఎంఆర్ ప్రజల ఆదరణ పొందుతోందన్నారు. రాజాంలో కొత్తగా ఏర్పాటుచేసిన షోరూంలో ఇచ్చే ఆఫర్లను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఆర్ డైరెక్టర్లు మావూరి వెంకటరమణ, మావూరి సత్యవీరసంతోష్‌మోహన్‌బాలాజీ, హారిక, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, సీతారామ గ్రూప్ ఎండీ సి.వి.జగన్నాథస్వామి, వైద్యుడు ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

#### తెలుగు అంటే ఇష్టం

తెలుగు భాష అంటే చాలా ఇష్టమని, తెలుగు సినిమాల్లో నటించే అవకాశాలు ఎక్కువగా రావడం అదృష్టమని మీనాక్షి చౌదరి అన్నారు. ఆమెను చూసేందుకు వచ్చిన రాజాం ప్రజలతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు తెలుగుభాషలో 8 సినిమాల్లో నటించానన్నారు. వీటిలో లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు మంచి గుర్తింపునిచ్చాయన్నారు. త్వరలో నాగచైతన్యతో సినిమా తీస్తున్నట్టు వెల్లడించారు. డెంటల్ విభాగంలో వైద్యవిద్యను అభ్యసించానని, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ క్రీడల్లో మంచి ప్రావీణ్యం ఉందని, ఆ పాత్రల్లో నటించాలని ఉందన్నారు.



రాజాంలోని సీఎంఆర్ జ్యువెలరీ షాప్‌లో బంగారు ఆభరణాన్ని చూపిస్తున్న మీనాక్షి చౌదరి, మావూరి వెంకటరమణ, తదితరులు

#### మీనాక్షి చౌదరి సామాజిక చైతన్యం



డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న మీనాక్షి చౌదరి

రాజాంలో సీఎంఆర్ జ్యువెలరీ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన అనంతరం మీనాక్షి చౌదరి తన సామాజిక సేవాభావాన్ని చాటుకున్నారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, పోలీసులతో కలిసి డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, ఎస్‌ఐ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన పశువైద్య విద్యార్థులు



గరవిడి- విజయనగరం ప్రధాన రహదారిపై పశువైద్యవిద్యార్థుల నిరసన ర్యాలీ

- 41వ రోజుకు చేరుకున్న నిరవధిక దీక్షలు
- ప్రభుత్వ తీరుపై నిరసన

చీపురుపల్లిరూరల్ (గరివిడి): తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని గరివిడి వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల విద్యార్థులు కోరారు. కళాశాలకు వీసీఐ గుర్తింపు, స్టైఫండ్ రూ.25వేలకు పెంచాలని 41 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడంపై మండిపడ్డారు. దీనికి నిరసనగా గరివిడి–విజయనగరం ప్రధాన రోడ్డుపై శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కాసేపు ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## సమగ్ర వివరాలు లేని ప్రణాళికలు ఆచరణ శూన్యం

- పీ–4, స్వర్ణాంధ్ర విజన్–2047పై చర్చలో జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్‌బాబు



హాజరైన జిల్లా అధికారులు



విజయనగరం అర్బన్: గ్రామస్థాయిలో వనరులు, అభివృద్ధి అవకాశాల అంచనా వివరాలు లేకుండా.. శాఖాపరమైన మదింపు చేయకుండా అభివృద్ధి విజన్ ప్రణాళిక ఆచరణ సాధ్యం కాదని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తేల్చిచెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీ–4, స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికలో భాగంగా నియోజకవర్గం అభివృద్ధికి విజన్ ప్లాన్ తయారీపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎ.బాబు పాల్గొన్నారు. నియోజకవర్గం ప్రణాళిక తయారీలో గజపతినగరం నియోజకవర్గంపై తయారు చేసిన మోడల్ ప్రణాళికను ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ వివరించారు. నియోజకవర్గం భౌగోళిక స్వరూపం, వనరుల లభ్యత, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే అంశాలు, పంటలు, నీటి వనరులు, భౌతిక, సాంస్కృతిక, పర్యాటక అంశాలు, బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లను వివరిస్తుండగా అసలు ఇవన్నీ గ్రామస్థాయిలో సేకరించినవేనా అంటూ బాబు సందేహం వ్యక్తంచేశారు. గ్రామస్థాయిలో రూపొందించని అభివృద్ధి ప్రణాళికలతో లాభం ఉండదన్నారు. రానున్న ఐదేళ్లకు ప్రతి శాఖ వాస్తవ, ఆచరణాత్మకమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. జిల్లాకు చెందిన ప్రోగ్రాం, ప్రాజెక్టులు కూలంకుషంగా ప్రణాళికలో కనపడాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో మామిడి వంటి వాణిజ్య పంటలకు డిమాండ్ ఉంటుందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పంటకు ఒక సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరల్చాలని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ఒక బిజినెస్ సెంటర్ ఏర్పాటుకు రెండు ఎకరాల భూమిని గుర్తించాలని సూచించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తాటిపూడి వద్ద బోటు విహార యాత్ర ద్వారా 2 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి ప్రణాళిక తయారీ కోసం నిర్వహించే చర్చకు పలువురు ఎమ్మెల్యేలు డుమ్మాకొట్టడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అధికార యంత్రాంగం విలువైన సమయం వృథా అయ్యిందన్న వ్యాఖ్యలు వినిపించాయి. సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ దాట్ల కీర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న డీఈఓ యు. మాణిక్యం నాయుడు

- రేపటి నుంచి పరీక్షలు
- 119 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 23,765 మంది విద్యార్థులు
- నాలుగు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

విజయనగరం అర్బన్: పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు డీఈఓ యు.మాణిక్యంనాయుడు శనివారం తెలిపారు. పరీక్షకు హాజరుకానున్న 23,765 మంది రెగ్యులర్ విద్యార్థులకు 119, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 614 మందికి 8 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు రెగ్యులర్ విద్యార్థులకు, ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్షల పర్యవేక్షకులు/డిపార్ట్‌మెంట్ అధికారులుగా 238 మంది, ఇన్విజిలేటర్లుగా 1,150 మంది, కస్టోడియన్లుగా 36 మంది, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 9 మంది విధుల్లో పాల్గొంటారని, 9 రూట్లలో స్టోరేజ్ సాయింట్లు 29 ఏర్పాటు చేశామన్నారు.

#### సీసీ కెమెరాల నిఘాలో..

మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఉన్న జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను అనుసంధానం చేసినట్టు డీఈఓ తెలిపారు. పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమీపంలోని జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశాలిచ్చామన్నారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్‌మెంట్ అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వీరుకూడా సెల్‌ఫోన్‌లు, డిజిటల్ వాచీలు తీసుకెళ్లకూడదన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పరీక్ష ఉంటుందని, పరీక్షకు సమయానికి ముందుగానే 24 పేజీల బుక్‌లెట్ విద్యార్థికి అందజేస్తామన్నారు. బుక్‌లెట్ నంబర్ వేసి, విద్యార్థితో పాటు ఇన్విజిలేటర్ ధ్రువీకరించాలన్నారు. ఏమైనా తప్పులుంటే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అదనంగా కావాలంటే మరో 12 పేజీల వరకు ఉన్న బుక్‌లెట్ ఇస్తారు.

#### స్ట్రాంగ్ రూంలో సహాయ కేంద్రం

విద్యాశాఖకు చెందిన స్ట్రాంగ్ రూంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సందేహాలను సెల్ 90009 45346 నంబర్‌కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు. జిల్లా పరిశీలకులుగా ఆదర్శ పాఠశాల జేడీ సుల్తానా బేగంను నియమించారు.

## క్లుప్తంగా

### కుక్కల దాడిలో నలుగురు చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారి

సాలూరు: పట్టణంలోని 18వ వార్డు పరిధి దుర్గానవీధిలో నలుగురు చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. శనివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై కుక్కలను తరిమేశారు. చిన్నారులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

### ఖేలో ఇండియా పోటీలకు ముగ్గురు..



ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో అధికారులు

విజయనగరం: ఢిల్లీలో ఈ నెల 20 నుంచి 23 వరకు జరగనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ముగ్గురు పారా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన క్రీడాకారులను శనివారం స్థానిక క్రీడాభివృద్ధి కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన పారా ఒలింపిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో కిల్లక లలిత, దొగ్గా దేముడు నాయుడు, సుంకరి దినేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో కిల్లక లలిత ఇప్పటికే ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో ఆడేందుకు వెళ్లగా.. మిగిలిన ఇద్దరు త్వరలో ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారని తెలిపారు. ఖేలో ఇండియా పోటీలలోనూ బాగా రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### 27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరేడ్‌లో ఈ నెల 27న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ (75 రోజులు), సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (30 రోజులు), హౌస్ వైరింగ్ (30 రోజులు).. అలాగే మహిళలకు టైలరింగ్ (30 రోజులు), కంప్యూటర్ డీటీపీ కోర్సు (45 రోజులు), మగ్గం అండ్ శారీ పెయింటింగ్ వర్క్స్ (30 రోజుల పాటు)లలో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 90147 16255, 94917 41129, 98669 13371, 998 99 53145 నంబర్లను సంప్రదించాలన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలకు పాల పౌడర్

- స్త్రీ సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



గోదాంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న పాల ప్యాకెట్ల స్థానంలో పాల పౌడర్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నట్టు స్త్రీ సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేసే ఏజెన్సీకి చెందిన రామభద్రపురంలో ఉన్న గోదాంను ఆమె శనివారం సందర్శించారు. సరుకుల సరఫరా, నిల్వలను ఏజెన్సీ నిర్వాహకుడు బండారు నాగరాజును అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద మన్యం, భద్రగిరి, కురుపాంలలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాలపౌడర్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంలో భాగంగా 3,173 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా చేస్తామని తెలిపారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹90 | ₹150 | ₹160 |

# పైసలిస్తేనే.. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు

- నగదు అందిస్తేనే కొనసాగింపు
- ఉపాధి హామీ వేతనదారుల వద్ద నుంచి రూ. వంద వసూలు చేయాలని అల్టిమేటం
- ఏపీఓ ఆదేశాల ప్రకారం నగదు వసూలు చేస్తున్న ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు



మణ్యపురిపేటలో ఉపాధి హామీ ఏపీఓపై విచారణ చేస్తున్న ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణదేవి

గుర్ల:

గ్రామాల్లో పేదలందరికీ వంద రోజుల పని కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వంద రోజుల పని నుంచి వారానికి రూ. వంద వసూలు చేసే సరికొత్త పథకాన్ని గుర్ల మండల ఉపాధి హామీ అధికారులు ప్రవేశ పెట్టడం విమర్శలకు దారితీస్తోంది. మండలంలోని 42 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. వేతనదారులు సక్రమంగా పని చేయడం లేదని బెదిరిస్తూ వారిని తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. వారానికి రూ. వంద నగదు ఇస్తే తక్కువ పని చేసినప్పటికీ టెక్నికల్ అసిస్టెంట్ సహాయంతో కొలతలను అధికంగా వేసి ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట వేతనాన్ని మీఖాతాలో జమ అయ్యేలా ఆన్‌లైన్ చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి చెబుతున్నారు. నగదు ఇస్తున్నట్లు స్థానిక నేతలకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగదు వసూలుపై ఎవరైనా వేతనదారులు ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలు చూపి ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

మణ్యపురిపేట సీనియర్ మేట్‌గా పనిచేసిన గార రామలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రూ. 50 వేల నగదును రెండు నెలలు కిందట మండల ఉపాధి హామీ అధికారి కామేశ్వరరావుకు ఇచ్చింది. అయితే మరో రూ. 10 వేలు ఇవ్వాలని అతను డిమాండ్ చేశారు. డిమాండ్ చేసిన నగదు ఇవ్వకపోవడంతో గ్రామానికి చెందిన మరో మహిళకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియామకపత్రం అందజేశారు. ఆమె వద్ద నుంచి రూ. 30 వేలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే నగదు తీసుకున్న విషయం ఎంపీడీఓ, ఉపాధి హామీ పీడీలకు బాధితురాలు రామలక్ష్మి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి విచారణ చేపట్టలేదు. జిల్లా అధికారి నుంచి మండల అధికారి వరకు వసూలు చేసిన నగదు సర్దుబాటు అవుతుందని సమాచారం. అందుకే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే గత సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో బాధితురాలు రామలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి మన్యపురిపేట పంచాయతీ కార్యాలయంలో శనివారం విచారణ చేపట్టారు.

### ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ. 50వేలు

మండలంలోని 42 పంచాయతీలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై స్థానిక నేతలు ఫిర్యాదు చేయడమే తరువాయి ఫిర్యాదు వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌తో మాట్లాడి రూ. 50 వేలు ఇవ్వాలని, లేకపోతే నిన్ను తొలగిస్తామని ఉపాధి ఏపీఓ కామేశ్వరరావు హెచ్చరిస్తారు. వేతనదారుల నుంచి రూ. వంద నగదు వసూలు చేస్తున్నప్పటికీ, ఫిర్యాదు వచ్చిన ప్రతిసారీ రూ. 50 వేలు ఇవ్వాలని ఒత్తిడి రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు లబోదిబోమంటున్నారు. మండలంలోని మణ్యపురిపేట, రాగోలు ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఫిర్యాదు రావడంతో రూ. 50 వేలు ఇవ్వాలని ఉపాధి ఏపీఓ డిమాండ్ చేశారు.

### 30,775 వేతనదారులు

మండలంలోని 42 పంచాయతీలలో 19,548 జాబ్ కార్డులున్నాయి. వీరిలో 34,711 మంది వేతనదారులు ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తు చేసుకోగా.. 30,775 మంది పనులకు హాజరవుతున్నారు. పనులు చేస్తున్న వారిందరి నుంచి వారానికి రూ. వంద వసూలు చేయడంతో వారానికి రూ. ముప్పై లక్షల పైనే నగదు వసూలవుతుంది. ఇంతా నగదు ఎవరి జేబుల్లోకి వెళ్తోందని వేతనదారులు చర్చించుకుంటున్నారు. దీనికితోడు గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు చెరువుల వద్ద నిర్మించిన శిలాఫలకాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన నగదు సర్పంచ్‌ల ఖాతాలకు జమ చేయకుండా ఉపాధి హామీ అధికారుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసుకున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి.

### వాస్తవం కాదు

ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమితులైన వారి నుంచి రూ. 50 వేల నగదు తీసుకున్నట్లు చేస్తున్న ఆరోపణలు నిజం కాదు. వేతనదారుల వద్ద నుంచి రూ. వంద వసూలు చేయడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా నగదు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులలో వాస్తవం లేదు.

కామేశ్వరరావు, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, గుర్ల

### రూ.50 వేలు ఇచ్చాను



మణ్యపురిపేట సీనియర్ మేట్‌గా పనిచేస్తున్న నాకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియామక పత్రం అందిస్తానని రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 50 వేలు ఇచ్చిన తర్వాత మరో రూ. 10 వేలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. రూ. 10 వేలు ఇవ్వకపోవడంతో మరో మహిళలకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. సీనియర్ మేట్‌గా ఉన్నప్పుడు గ్రామంలో పనిచేసిన 200 మంది నుంచి వారానికి రూ. 100 నగదు వసూలు చేసి టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓకి అందించాను.

గార రామలక్ష్మి, మణ్యపురిపేట

### ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయించారు



రాగోలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాపై ఒత్తిడి తీసుకువచ్చి రాజీనామా చేయించారు. నాపై ఫిర్యాదులు వస్తున్నాయని రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇవ్వకపోవడంతో ఉపాధి హామీ పనులలో చాలా అవకతవకలు జరిగాయని బెదిరించారు. అవకతవకలలో నిజం అయితే మీ ఆస్తి అమ్మైనా ప్రభుత్వానికి చెల్లించాలని, లేనిచో మీ స్థిరాస్తులు వేలం వేయిస్తామని బెదిరించారు. రాజీనామా చేస్తే ఎటువంటి విచారణ ఉండదని చెప్పడంతో ఒత్తడికి తలొగ్గి రాజీనామా చేశాను.

పతివాడ శ్రీను, రాగోలు

## 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో అగ్రశ్రేణిలో నిలవాలి

- జిల్లా ప్రత్యేక అధికారి బాబు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నగర ప్రజలు

విజయనగరం: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విజయగనరం అగ్రశ్రేణిలో నిలవాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.బాబు ఆకాంక్షించారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ జంక్షన్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.బాబు, కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, ఆర్డీఓ డి.కీర్తి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు. ముందుగా గంటస్తంభం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాలతో మహిళలు ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను, ప్లాస్టిక్ వస్తువులతో రూపొందించిన గృహాలంకరణ వస్తువులను తిలకించారు. కార్యక్రమంలో వయోజనవిద్య డీడీ ఎ.సోమేశ్వరరావు, కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు అమరజీవి జయంతి

పార్వతీపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి ఎస్.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మన్యం జిల్లాకు మూడు అంబులెన్స్‌లు



సాలూరు: గిరిబజార్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పార్వతీపురం మన్యం జిల్లాకు మూడు అంబులెన్స్‌లను కేటాయించింది. వీటిని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పట్టణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఎన్‌పీసీఐ కొవ్వాడ కేంద్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కామత్, అసోసియేట్ డైరెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**గిరిబజార్‌ను ప్రారంభించిన మంత్రి**

అంబులెన్స్‌లతో పాటు గిరిజనులకు నిత్యావసర వస్తువులు అందుబాటులో తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన గిరిబజార్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ వాహనాల ద్వారా నాణ్యమైన సరుకులను అందించడం జరుగుతుందని తెలిపారు.

**మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు**

మంత్రి సంధ్యారాణికు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**రోగులకు మెరుగైన సేవలను అందించేందుకే..**



పార్వతీపురం: అంబులెన్సుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, తదితరులు

పార్వతీపురం: రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు అదనంగా మూడు అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జిల్లాకు కేటాయించిన మూడు అంబులెన్స్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు సకాలంలో సేవలు అందించేందుకు వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు





సంఘటనా స్థలం వద్ద దెబ్బతిన్న వాహనాలు,(ఇన్‌సెట్లో) మృతుడు లక్ష్మణరావు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై వి. జ్ఞానప్రసాద్ తెలియజేసిన వివరాల ప్రకారం.. సాలూరుకు చెందిన బ్రహ్మకుమారీలు మౌంట్‌అబూ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరిని పికప్ చేసుకునేందుకు బొలేరో వాహనంలో శాంబాన లక్ష్మణరావు (62) బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అనంతరం బ్రహ్మకుమారీలను ఎక్కించుకుని సాలూరు వెళ్తుండగా.. ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి స్టీరింగ్‌పై పట్టుకోల్పోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొన్నారు. దీంతో వాహనం ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో అందరూ గాయపడ్డారు. ఇదే సమయంలో అటుగా వస్తున్న ఆటో డ్రైవర్ కె. రమణబాబు క్షతగాత్రులను తన ఆటోలో ఎక్కించుకుని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. లక్ష్మణరావు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అనంతరం క్షతగాత్రులు రాజరత్నం, సుజాత, తదితరులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి అక్కడ నుంచి విశాఖ తరలించారు. ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్మీలో అగ్నివీర్ అవుతారా?

- అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు
- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు
- విశాఖలో మరోసారి ర్యాలీ
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

**ఈ ఏడాది కీలక మార్పులు**

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహ 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటిడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్'అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891-2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

## ఆఖరి ప్రయాణం

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి
- ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు



ప్రమాదానికి గురైన కారు



మృతి చెందిన శంకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్/సంతకవిటి: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు ప్రాణాలను గాల్లో కలిపేసింది. టైరు పంక్చర్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన నలుగురిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ కుటుంబంలో ఆదివారం బర్త్‌డే వేడుకలు జరగాల్సి ఉంది. మరొకరి ఇంటిలో దత్తత వేడుక జరిగింది. కానీ వీరి విధిరాత మరోలా ఉంది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. పాతపట్నం గ్రామం పెద్దలోడి గ్రామానికి చెందిన దువ్వారి లక్ష్మీపతి(31) విశాఖపట్నంలోని మధురవాడలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామంలో స్నేహితుడి వివాహానికి హాజరై శనివారం తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం తన అన్న బర్త్ డే ఉండడంతో తన కారులోనే తల్లి మీనమ్మ (56), బావ ఉగ్రపల్లి భాస్కరరావు (45), మేన కోడలు కుసుమ, తండ్రి కాళిదాసుతో కలిసి బయల్దేరారు. కారులో విశాఖ వెళ్తుండగా లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై కారు టైరు పంక్చర్ అయ్యి బండి అదుపు తప్పిపోయింది. సరిగ్గా అదే సమయానికి తోలాపి శంకరరావు(41) రోడ్డు పక్కన తన స్కూటీని ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదుపు తప్పిన కారు అమాంతం శంకరరావును ఢీకొట్టి రోడ్డు పక్కన లేఅవుట్‌లోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. ఘటనలో శంకరరావు తీవ్రంగా గాయపడి అక్కడే ఊపిరి వదిలేశాడు. కారులో ఉన్న మీనమ్మ, భాస్కరరావు సంఘటన స్థలంలోనే మృతిచెందారు. లక్ష్మీపతి, కాళిదాసు, కుసుమ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. అయితే లక్ష్మీపతి ఆస్పత్రిలో చేరుస్తుండగానే కన్ను మూశారు. క్షతగాత్రులు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఒంటరైపోయింది..**

ఘటనలో చనిపోయిన శంకరరావు స్వగ్రామం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరిశంకరపేట. ఈయన రణస్థలంలోని యూబీ బేవరేజెస్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఏడాది కిందటే శంకరరావు కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. అనంతరం ఆయన ఓ బాలికను దత్తత చేసుకున్నారు. ఆ బాలిక జనన ధ్రువీకరణ పత్రం కోసం శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి, చేపలు పట్టుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో భార్య జీవన కుమారి కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న వెంటనే ఆమె మద్దూరుశంకరపేట నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చారు. ఏడాది కిందటే కుమారుడిని కోల్పోయి తీరని శోకంలో ఉన్న ఆమెకు ఇప్పుడు భర్త కూడా దూరం కావడంతో గుండెలవిసేలా రోదించారు.